క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపరలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో గోవింద నామాలు ఆచరింపజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత లక్ష్మీనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ఇండిపెండెంట్ నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలను అధికారికి అందజేస్తున్న ఆనంద్‌కుమార్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల్లో రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బర్రె ఆనంద్‌కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి ఓ సెట్టు నామినేషన్ పత్రాలు అందించారు. దీంతో ఈ నియోజకవర్గం నుంచి ఇంతవరకు మూడు నామినేషన్లు పడ్డాయి.

కనుల పండువగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పెదపూడి: మండలంలోని వేంద్రలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి కల్యాణం శనివారం ఉదయం కనులపండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, శ్రీనివాసు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయంలో ఉదయం స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవానికి భక్త జనం పోటెత్తారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఉన్న రథాన్ని గ్రామ వీధుల వెంట నడిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై నేషనల్ వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌క డాక్టర్ పోల భాస్కర్, ఆర్జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్ పై శనివారం నేషనల్ వెబినార్ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి ప్రపంచం కంప్యూటర్ పైనే నడుస్తోందని, విద్యార్థినులందరూ నేషనల్ వెబినార్‌ను సద్వినియోగపరచుకోవాలన్నారు. వెబినార్‌కు రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఎ.ప్రియ క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. ఇది సంస్థల అనేక లోపాలను తొలగించడానికి సహాయపడుతుందని వివరించారన్నారు. కార్యక్రమం నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి మోనికామహద్, అధ్యాపకురాలు భువనేశ్వరిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

చదువుకు చేయూత



బిక్కవోలు ప్రభుత్వ పాఠశాలలో విద్యాకానుక అందజేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)



మెళ్లూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యా కానుక అందజేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు
- నాడు–నేడుతో స్కూళ్లలో మెరుగైన వసతులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

పెదపూడి: 'పిల్లల చదువుకు పేదరికం అడ్డు కాకూడదు.. పిల్లలకు మనం ఇచ్చే తరగని ఆస్తి విద్య మాత్రమే.. మీరు పిల్లలను బడికి పంపించండి.. మేనమామగా వారి చదువు బాధ్యత నేను తీసుకుంటాను..' అని చెప్పిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అన్న మాట ప్రకారం ఆయన విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు చేపట్టారు. నాడు–నేడు పథకం ద్వారా నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద తదితర పథకాలు అమలుచేస్తున్నారు. నిరుపేదల జీవితాల్లో విద్యా వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నంపై తల్లిదండ్రులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పాఠశాలలు తెరిచే రోజునే విద్యా సంవత్సరం మొత్తానికి సరిపోయేలా ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, బ్యాగ్, బూట్లు, సాక్సులు, బెల్టు, మూడు జతల యూనిఫాం కలిపి జగనన్న విద్యా కానుకగా అందిస్తున్నారు. దీని కోసం ఒక్కో విద్యార్థిపై రూ.2500 ఖర్చు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో కలిపి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తంగా 191 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 19,824 మంది విద్యార్థుల కోసం గత నాలుగు విడతల్లో జగనన్న విద్యాకానుక నిమిత్తం సుమారు 17.6 కోట్ల మేర ఖర్చు చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు.

నియోజకవర్గంలో విద్యా కానుక నిమిత్తం చేసిన ఖర్చు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	ఖర్చు(రూ.కోట్లలో)
అనపర్తి	44	4,503	4.5
బిక్కవోలు	39	4,256	3.7
పెదపూడి	60	5,107	4.3
రంగంపేట	48	5,958	5.1
మొత్తం	191	19,824	17.6

విద్యాకానుక చాలా బాగుంది



ముఖ్యమంత్రి జగన్ మావయ్య వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తున్నారు. మాకు విద్యా సంవత్సరానికి సరిపడా పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, డిక్షనరీ, సాక్సులు, బెల్ట్ అందిస్తూ మా తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా చేశారు. విద్యాకానుక చాలా బాగుంది. పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సహకారం మరువలేనిది.

– వి.సత్యశ్రీ, విద్యార్థిని, పదో తరగతి, పెదపూడి

జగన్ మావయ్యకు రుణపడి ఉంటాం



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు, మంచి మెనూతో మధ్యాహ్న భోజనం, విద్యాకానుక అందిస్తున్నారు. పేదల చదువులకు సహకరిస్తున్న జగన్ మామయ్యకు రుణపడి ఉంటాం. మా తల్లిదండ్రులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే అన్ని ఉచితంగా అందించడం చాలా ఆనందంగా ఉంది.

– వి.వరలక్ష్మీదేవి, విద్యార్థిని, 8వ తరగతి, పెదపూడి

కోరుకొండలో జోరుగా ఎన్నికల ప్రచారం



కోరుకొండలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా తరపున కోరుకొండలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక కుమ్మర్ల వీధి, అంకాలమ్మ వారి దేవాలయం, సాయిబాబా వారి ఆలయం, అగ్రహారం ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా అభివృద్ధికి ఓటెయ్యాలని నాయకులు ఓటర్లను కోరారు. ప్రజాసేవ చేస్తున్న జక్కంపూడి రాజాకు ఫ్యాను గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు కాళ్ల వీరబాబు, గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, నాయకులు బొరుసు బద్రి, నీరుకొండ బాబ్జి, కటకం బాబ్జి, కోడూరి సత్తిరెడ్డి , భాస్కర్, మహిళానేతలు శిరీషా తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



అనపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మికి హారతిచ్చి ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- అనపర్తిలో ఎన్నికల ప్రచారం

అనపర్తి: వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ధరణికోట శివాలయం ప్రాంతంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మహిళలు అడుగడుగునా పూలు చల్లుతూ ఆదిలక్ష్మి ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, మిలట్రీరెడ్డి, ఎస్ఎస్, కోనాల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి
- రఘుదేవపురంలో ఇంటింటి ప్రచారం
- వైఎస్సార్ సీపీ నాయకుల్లో ఉత్సాహం



రఘుదేవపురం ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సుకీర్తి

సీతానగరం: మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ జక్కంపూడి సుకీర్తి అన్నారు. శనివారం రఘుదేవపురం డాక్టర్ సుకీర్తి ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకీర్తి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆ పథకాల ద్వారా వచ్చే ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారులు ఖాతాలోకి నేరుగా జమ చేస్తున్నారని గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోఆర్డీనేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉపసర్పంచ్ పట్టపగల ప్రసాద్, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మండల సర్పంచ్ సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, పిచ్చుకుల విజయ్ కుమార్, పిండి రాధాకృష్ణ, యలమాటి కాశీ, పైడి రాజు, సుంకర సూర్యచంద్రం, కాండ్రు వెంకట్రాజు, ఏపుగంటి సత్తిబాబు, వట్టికూటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జక్కంపూడి గణేష్

- ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

సీతానగరం: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పిలుపునిచ్చారు. శనివారం చినకొండేపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్లమూరి బలరామరాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన కోడమంచాలి కుమార్, చిడిపి సుబ్బారావు, ఆరుగోళ్ల వెంకట సత్యనారాయణ, తటపూడి ఏసు, చిరా బస్కరావు, చిడిపి సురేష్, చిడిపి తొండయ్య తదితరుల తోపాటు 100 మందికి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జక్కంపూడి గణేష్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ చేకూరి సత్తిపండురాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణరాజు, యర్రంశెట్టి బాబులు, వడ్లమూరి రవి, ముదునూరి సుబ్రహ్మణ్యం రాజు, కోసూరి నాగరాజు, వడ్లమూరి నరసింహరాజు, సూరపురెడ్డి రామకృష్ణ, ముదునూరి ప్రసాదరాజు, పత్తి వెంకటేశ్లు, చిడిపి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఫేక్ ఓట్ల డ్రామా

బత్తులపై విరుచుకుపడిన వైఎస్సార్ సీపీ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: జనసేన అభ్యర్థి ఓటమి భయంతో ఫేక్ ఓట్ల డ్రామా ఆడుతున్నారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 20 వేల ఓట్లకు పైబడి ఫేక్ ఓట్లు ఉన్నాయంటూ జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ చేసిన ఆరోపణలను ఖండిస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ దూలం పెద్ద మాట్లాడుతూ బత్తులకు తన భవిష్యత్తు కళ్లెదుట కనిపిస్తున్నట్టుగా ఉందని, ఈ ఎన్నికలలో తన ఓటమి ఖాయమని గ్రహించడంతోనే ఈ రకమైన డ్రామాలు ఆడుతున్నాడన్నారు. 20 వేలకు పైబడి ఫేక్ ఓట్లు ఉన్నాయంటూ ఆయన చేసిన ఆరోపణలను చూస్తుంటే నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై ఏమాత్రం అవగాహన లేదనే విషయం తేటతెల్లమవుతుందన్నారు. నియోజకవర్గంలో 2014లో 194,019 మంది ఓటర్లు ఉంటే 2019 నాటికి ఆ సంఖ్య 201,201కి పెరిగిందన్నారు. అంటే ఐదేళ్లలో 7182 మంది ఓటర్లు పెరిగారు. 2024 నాటికి 208,058 మంది ఓటర్లు ఉండగా 2019 కంటే 6857 మంది ఓటర్లు పెరిగారు. ఈ విషయాన్ని ఎలిమెంటరీ స్కూలుకు వెళ్లే చిన్న పిల్లాడిని అడిగినా చెపుతాడు, కానీ ఈ విషయం జనసేన అభ్యర్థి బత్తులకు తెలియకపోవడం అతని పరిజ్ఞానానికి నిదర్శనగా పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న మాట్లాడుతూ 20 వేలకు పైబడి ఫేక్ ఓట్లు ఉన్నాయంటూ ప్రచారం చేస్తున్న బత్తుల వేరొక నియోజకవర్గంలో ఉన్న తన బంధువులకు సీతారామపురంలో ఓట్లు ఏవిధంగా వచ్చాయో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను గెలిచే అవకాశం లేదని గ్రహించడం వల్లనే గ్రామగ్రామాన దొంగ ఓట్లు నమోదు చేయించి, ఏమీ ఎరుగని వారిలా ఫేక్ ఓట్లు అంటూ కొత్త డ్రామా ఆడుతున్నాడని ఘటుగా విమర్శించారు. పార్టీ సీనియర్ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు మాట్లాడుతూ తరచూ బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి, స్మగ్లింగ్ అంటూ పదే పదే విమర్శలు చేస్తున్న మీరు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. గత చరిత్ర అంతా అరాచకమయంగా సాగించిన మీ రాకతోనే ఇవన్నీ వచ్చాయనే విషయాన్ని మరచిపోయారా? అని ప్రశ్నించారు. పార్టీ మండల కోకన్వీనర్ గండి నానిబాబు మాట్లాడుతూ మా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలను ఓట్లు అడుతున్నారన్నారు. ఈ ఎన్నికలలో మా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గెలుపు ఖాయమని, మెజార్టీని 45 వేలకు పైబడి తీసుకురావాలనే తపనతో తామంతా పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు వేమగిరి కృష్ణ, కోలపాటి పెదవెంకన్న, కుందేటి ప్రసాద్, పంపన శ్రీను, కొల్లి వీర్రాజు, ఉండమట్ల రాజు, బత్తుల వెంకట్రావు, సోమరాజు, దుర్గారావు, వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ



జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి తానేటి వనిత

రాజానగరం: రోడ్డు ప్రమాదానికి గురై రాజానగరం, రాజమహేంద్రవరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న గోపాలపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులను రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత శనివారం పరామర్శించారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, తిరిగి వెళ్తున్న సమయంలో కొంతమంది రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో గాయపడి స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లజర్ల మండలం, పోతవరానికి చెందిన మిర్యాల రాంబాబును మంత్రి పరామర్శించి, మానసిక ధైర్యాన్ని అందించారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అదే మండలానికి చెందిన కలపాల గణేష్‌బాబు, దేవరపల్లి మండలం కురుకురుకు చెందిన పల్లపు అబ్బులను పరామర్శించారు. అండగా ఉంటానంటూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులతో మాట్లాడారు. నామినేషను దాఖలు కార్యక్రమం ఎంతో ఆనందంగా జరిగిన వేళలో ఇటువంటి ప్రమాదానికి కొంతమంది గురికావడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు. ఆమె వెంట ఆయా మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కోరుకొండలో వలంటీర్ల రాజీనామా



కోరుకొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాజీనామా చేసిన వలంటీర్లు

మధురపూడి: కోరుకొండ సచివాలయం–1, 2 లకు చెందిన వలంటీర్లు 25 మంది శనివారం రాజీనామా చేశారు. ఎంతో కాలంగా సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిందారోపణలకు గురి చేసిందున రాజీనామా చేస్తున్నట్టు కోడూరి దుర్గా అర్జున్‌రెడ్డి తెలిపారు. జనసేన నేత పవన్‌కల్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సేవేలక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్లను విమర్శించడం సహేతుకం కాదని వారికి హితవు పలికారు. మండలంలోని పలు సచివాల యాలకు చెందిన వలంటీర్లు రాజీనామా చేస్తున్నారు. దానిలో భాగంగా మండల కేంద్రమైన కోరుకొండకు వలంటీర్లు రాజీనామా చేసి, వాటిని కాపవరంలోని ఎంపీడీఓ హేమ సుందరరావుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు కోడూరి దుర్గా అరున్‌రెడ్డి, పత్తి శుభాష్, ధనలక్ష్మి, సూరిబాబు, చంద్ మునీషా, మధులత దేవి, కందుల బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం వేంకటేశ్వరుని కల్యాణం

కడియం: కడియపులంక హరిహర మహా క్షేత్రంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదికలో కల్యాణాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో శ్రీవారిని అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై ఉంచి పెండ్లి ముస్తాబు చేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ప్రత్యేకంగా తీసుకొచ్చిన వాయిద్య బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, విశేష బాణసంచాలు, భక్తుల నడుమ స్వామివారిని అమ్మవారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ లక్ష్మి దంపతులు సంప్రదాయంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. సుముహూర్త సమయంలో వేదమంత్రోచ్చారణలు, బాజా భజంత్రీలు, బాణసంచాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణం

కడియం: స్థానిక కెనాల్‌రోడ్డులోని రాజవీధిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి తిరు కళ్యాణోత్సవాన్ని వైఖానస ఆగమశాస్త్ర రీత్యా వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వైఎస్సార్ సీపీ నాయకులు గిరజాల వీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మహిళా నాయకులు ఊటుకూరి శైలజ, దుళ్ల ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు దర్శించుకున్నారు.

ఒక్క నామినేషన్ దాఖలు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల సంబంధించి శనివారం ఒక్క నామినేషన్ దాఖలైంది. జైభీమ్ భారత్ పార్టీ తరపున ఎల్.గంగాధర్ తన నామినేషన్ పత్రాలను ఆర్ఓ ఎం.మాధురికి అందజేశారు. దీంతో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రెండు నామినేషన్లు దాఖలైనట్లైంది.